నిరుపయోగంగా 'గురుకుల' భవనం



నిరుపయోగంగా ఉన్న కోడ్గల్ గిరిజన సంక్షేమ బాలికల గురుకుల పాఠశాల భవనం

జడ్చర్ల టౌన్: మండలంలోని కోడ్గల్ జెడ్పీ హైస్కూల్ ప్రాంగణంలో రూ.4.20 కోట్లతో నిర్మించిన గిరిజన సంక్షేమ గురుకుల పాఠశాల (బాలికలు) భవనం ప్రారంభానికే పరిమితమైంది. బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో 2023 మే 31న అట్టహాసంగా నాటి మంత్రి శ్రీనివాస్‌గౌడ్, అప్పటి ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి భవనాన్ని ప్రారంభించారు. అదే ఏడాది జూన్ నెలలోనే భవనంలోకి ధర్మాపూర్ నుంచి గురుకుల పాఠశాలను తరలిస్తారని అందరూ భావించారు. వసతుల కల్పన చేయకపోవడంతో నేటికి ధర్మాపూర్‌లోనే గురుకుల కొనసాగుతోంది. దీంతో ప్రస్తుతం కోడ్గల్‌లో నిర్మించిన భవనం నిరుపయోగంగా మారింది. నాటి బీఆర్ఎస్ ప్రభుత్వం గురుకుల పాఠశాలల పెంపు నిర్ణయంలో భాగంగా జడ్చర్ల నియోజకవర్గానికి గిరిజన సంక్షేమ బాలికల గురుకుల పాఠశాల మంజూరు చేసింది. నియోజకవర్గంలో సరైన భవనం లభించకపోవటంతో తాత్కాలికంగా మహబూబ్‌నగర్ సమీపంలోని ధర్మాపూర్ వద్ద అద్దెభవనంలో నిర్వహిస్తున్నారు. ఇదేక్రమంలో 2021లో గిరిజన సంక్షేమశాఖ ద్వారా అప్పటి రాష్ట్ర ప్రభుత్వం గురుకుల పాఠశాల స్వంత భవనం కోసం నిధులు మంజూరు చేసింది. అనువైన స్థలాలు లభించకపోవటంతో మండలంలోని కోడ్గల్ హైస్కూల్ ప్రాంగణంలో స్థలం ఎంపిక చేశారు. 2021 జూన్ 20న అప్పటి ఎమ్మెల్యే డా.లక్ష్మారెడ్డి భవన నిర్మాణ పనులకు శంకుస్థాపన చేశారు. రెండేళ్లలోనే నిర్మాణ పనులు పూర్తిచేసి గత ఏడాది మే 31న భవనాన్ని ప్రారంభించారు. అయితే పూర్తిస్థాయిలో డైనింగ్‌హాల్, ప్రహరీ, నీటివసతి వంటివి కల్పించలేదు. దీంతో ధర్మాపూర్ నుంచి తరలింపు చేయలేదు. భవనం ప్రారంభమై ఏడాది గడిపోయినా ఇప్పటికీ వసతులు కల్పించలేదు. కాగా డైనింగ్ హాల్‌కు వారం రోజుల క్రితమే స్లాబ్ వేశారు. పూర్తికావటానికి మరో 4 నెలల సమయం పట్టే అవకాశాలు ఉన్నాయి. దీంతో డార్మేటరీ గదులను డైనింగ్‌కు వినియోగించాలని గిరిజన గురుకులాల అధికారులు నిర్ణయించారు. అయినప్పటికీ ఆ దిశగా అడుగులు పడలేదు. ఉన్న భవనానికీ ప్రహరి లేకపోవటం సమస్యగా పరిణమించింది. బాలికల గురుకుల పాఠశాల కావటం వల్ల ప్రహరీ నిర్మాణం జరిగితేనే భద్రత ఉంటుంది. నిర్మాణానికి సైతం మరింత ఆలస్యం అవుతుండటం కూడా పాఠశాల తరలింపునకు అడ్డుగా మారింది. ఇక తాగునీటికోసం స్లంప్ నిర్మాణం చేయాల్సి ఉన్నా అది పూర్తికాలేదు. స్లంప్ నిర్మాణం నత్తనడకన సాగుతుంది. తాత్కాలికంగా నీళ్ల ట్యాంకులు ఏర్పాటు చేసి వాటిద్వారా నీటిని అందించాలని గురుకుల అధికారులు నిర్ణయించినట్లు తెలుస్తోంది. వాస్తవానికి ఈ ఏడాది జూన్ 12న పాఠశాలలు పునఃప్రారంభం సమయానికి భవనాన్ని సిద్ధం చేయాలని గురుకుల అధికారులు భావించినప్పటికీ ఆ దిశగా చర్యలు తీసుకోవటంలో విఫలం అయ్యారు. ఈ కారణంగా మరికొంతకాలం అద్దెభవనంలోనే పాఠశాల నిర్వహించే అవకాశం లేకపోలేదు. ఈ నేపథ్యంలో కోడ్గల్‌లో గురుకుల ఎప్పుడు ప్రారంభమవుతుందో తెలియని పరిస్థితి నెలకొంది. వీటితోపాటు స్కూల్ కాంప్లెక్స్ సముదాయం కోసం రూ.5కోట్లు మంజూరయ్యాయి. అవి టెండరు పనులు పూర్తయి నిర్మాణం నత్తనడకన సాగుతున్నాయి. భవనం పూర్తి అయ్యేందుకు మరో ఏడాది సమయం పట్టే అవకాశాలున్నాయి. ఈ విషయంపై గిరిజన సంక్షేమశాఖ అధికారులను వివరణ కోరేందుకు ప్రయత్నించగా వారు ఫోన్‌లో అందుబాటులోకి రాలేదు.

ఖాళీ చేయాలని ఒత్తిడి

ప్రస్తుతం ధర్మాపూర్ వద్ద అల్‌మదీనా కళాశాలలో గురుకుల సంక్షేమ బాలికల పాఠశాల నిర్వహిస్తున్నారు. కాగా కళాశాల యాజమాన్యం భవనాన్ని ఖాళీ చేయాలని సూచిస్తున్నారు. దీంతో అధికారులకు సమస్యగా మారింది.



నిర్మాణంలో ఉన్న డైనింగ్‌హాల్



నిర్మాణంలో ఉన్న సంప్

క్లుప్తంగా

ఆలయ నిర్మాణానికి విరాళం

బాలానగర్: నేరళ్లపల్లి లక్ష్మీనర్సింహస్వామి ఆలయ నిర్మాణం కోసం గ్రామానికి చెందిన రాజు ముదిరాజ్ రూ. 20 వేల విలువ చేసే సామగ్రి విరాళంగా ప్రకటించారు. ఆదివారం గ్రామ ఎంపీటీసీ లింగునాయక్, మాజీ సర్పంచ్ ఖలీల్, జగత్ ప్రకాష్, జమీర్ పాష తదితరుల సమక్షంలో ఆలయ కమిటీ సభ్యులకు సామగ్రి అందించారు.

13న సర్వసభ్య సమావేశం

గండేడ్: ఈనెల 13న మండల సర్వసభ్య సమావేశం నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ దేవన్న తెలిపారు. మండల పరిషత్ కార్యాలయంలో ఉదయం 11 గంటలకు ఎంపీపీ మాధవి అధ్యక్షతన సమావేశం నిర్వహించనున్నట్లు వివరించారు. ఎమ్మెల్యే రామ్మోహన్‌రెడ్డి హాజరవుతారని పేర్కొన్నారు. ఎంపీటీసీలు, అధికారులు తదితరులు తప్పకుండా రావాలని సూచించారు.

కార్యవర్గం ఎన్నిక

జడ్చర్ల టౌన్: అప్పి, బజాజ్, టాటామ్యాజిక్ ఆటోయూనియన్ పట్టణ కార్యవర్గాన్ని ఆదివారం ఎన్నుకున్నారు. యూనియన్ వ్యవస్థాపక అధ్యక్షుడు రాజగాని అశోక్ ఆధ్వర్యంలో పట్టణ అధ్యక్షుడిగా షేక్ హాజీ, ఉపాధ్యక్షుడిగా మధు, ప్రధాన కార్యదర్శిగా కొంగళి వెంకట్, కార్యదర్శులుగా అహ్మద్ అలీ, బాబర్, సలహాదారులుగా రాములు, ఖదీర్‌లు, కార్యవర్గ సభ్యులుగా మహేష్, సలీం, ఇనాయత్‌లు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. మండల అధ్యక్షుడు శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

ఆర్థికసాయం

అడ్డాకుల: మండలంలోని వర్నె గ్రామానికి చెందిన కాంగ్రెస్ కార్యకర్త జలనీల శేఖర్ మృతి చెందడటంతో బాధిత కుటుంబాన్ని ఆదివారం ఆ పార్టీ నాయకులు పరామర్శించారు. దేవరకద్ర ఎమ్మెల్యే జి. మధుసుదన్ రెడ్డి సూచనతో బాధిత కుటుంబానికి రూ.10వేలు ఆర్థికసాయం అందించారు. డీసీసీ ఆర్గనైజింగ్ సెక్రటరీ అరవింద్ కుమార్‌రెడ్డి, జిల్లా కిసాన్ మోర్చా అధ్యక్షుడు నాగిరెడ్డి, మండల అధ్యక్షుడు శ్రీహరి, జిల్లా కార్యదర్శి విజయ్ మోహన్ రెడ్డి, సీనియర్ నాయకులు దశరథ్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

బాధిత కుటుంబానికి పరామర్శ

దేవరకద్ర: కోయిల్‌సాగర్ గ్రామంలో బీఆర్ఎస్ కార్యకర్త లక్ష్మణ్ కుమారుడు రాహుల్ ఇటీవల మృతి చెందడంతో ఆదివారం మాజీ ఎమ్మెల్యే ఆల వెంకటేశ్వర్‌రెడ్డి గ్రామానికి వెళ్లి బాధిత కుటుంబసభ్యులను పరామర్శించారు. అనంతరం వివిధ కార్యక్రమాల్లో పాల్గొన్నారు. మండల పార్టీ అధ్యక్షులు జట్టి నర్సింహారెడ్డి తదితరులు ఉన్నారు.

పర్యావరణాన్ని పరిరక్షించుకుందాం

జడ్చర్ల టౌన్: బాదేపల్లి పాతబజార్‌లో జనతా సోషల్ సర్వీసెస్ స్వచ్ఛంద సంస్థ సభ్యులు ఆదివారం 50 మొక్కలు నాటారు. పర్యావరణ పరిరక్షణ, పరిసరాలలో పచ్చదనం పెంపు కోసం మొక్కలు నాటుతున్నట్లు సంస్థ సభ్యులు తెలియజేశారు. వర్షాలు ప్రారంభం అయినందున ప్రతి ఒక్కరు ఒక్కో మొక్క నాటి భావితరాలకు మంచి వాతావారణం అందించాలని వారు పిలుపునిచ్చారు.

పూర్వవిద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం

అడ్డాకుల: మండల కేంద్రంలోని జిల్లా పరిషత్తు ఉన్నత పాఠశాలలో ఆదివారం (1998–99వ సంవత్సరం పదోతరగతి) పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. నాటి గురువులను పాఠశాలకు ఆహ్వానించి సత్కరించారు. కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు చంద్రం, సమద్, వెంకటేష్,హలీం, అఖిల్, వెంకటేష్, సాగర్, హన్మంతు, కృష్ణయ్య, శేఖర్, రామకృష్ణ, ప్రశాంత్, శ్రీను, జానకి, రాములు తదితరులు పాల్గొన్నారు.

ప్రతి ఒక్కరూ భగవద్గీత చదవాలి

కొత్తకోట రూరల్: భగవద్గీతలో శ్రీకృష్ణుడు చెప్పిన మొట్టమొదటి శ్లోకంలో జ్ఞానాన్ని గ్రహించేందుకు ప్రతి ఒక్కరూ త్రైత సిద్ధాంత భగవద్గీతను చదవాలని ప్రబోధ సేవా సమితి కమిటీ కొత్తకోట, పెబ్బేరు మండలాల అధ్యక్షులు విజయభాస్కర్‌రెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. ఆదివారం కొత్తకోట పట్టణ సమీపంలో గల సాలెపేట కాలనీలో ఆచార్య ప్రబోధానంద యోగీశ్వర్లు రచించిన ఆధ్యాత్మిక 100 రకాల త్రైత సిద్ధాంత గ్రంథాలను గురించి కాలనీవాసులకు వివరించారు. భగవద్గీతలోని పురుషోత్తమ ప్రాప్తి యోగం అధ్యాయనం నందు 16వ శ్లోకంలో క్షర పురుషుడు అని జీవాత్మ గురించి, అక్షర పురుషుడు అని ఆత్మ గురించి 17వ శ్లోకంలో పురుషోత్తముడని జీవాత్మ, ఆత్మ, పరమాత్మ అనే మూడు ఆత్మల విధానంలో వివరించడంతో చాలా గొప్పగా త్రైత సిద్ధాంత భగవద్గీతలో వివరంగా రాశారన్నారు. భగవద్గీతను చదివిన వారు ధన్యులని తెలిపారు. కార్యక్రమంలో బాలకృష్ణ, పురుషోత్తం, శివ, జహంగీర్, వేణు, భాస్కర్‌రెడ్డి, రాములు, మహేశ్వరి, పద్మ తదితరులు ఉన్నారు.

ఇసుక ట్రాక్టర్ పట్టివేత

మిడ్జిల్: మండల పరిధిలోని కొత్తూర్ సమీపంలోని దుందుభీ వాగు నుంచి అనుమతి లేకుండా ఇసుక తరలిస్తున్న ట్రాక్టర్‌ను ఆదివారం తెల్లవారుజామున పోలీసులు పట్టుకున్నారు. ఈ మేరకు కేసునమోదు చేసినట్లు ఎస్‌ఐ ఆనంద్ తెలిపారు. మండలంలో అక్రమ ఇసుక రవాణకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని ఎస్‌ఐ హెచ్చరించారు.

నోట్ బుక్స్ పంపిణీ

నవాబుపేట: కారుకొండ గ్రామపంచాయతీ శ్యామగడ్డతండాకు చెందిన విద్యార్థులకు సేవాలాల్ సంఘం ఆధ్వర్యంలో నోట్‌బుక్స్, పెన్నులు తదితరాలను ఆదివారం పంపిణీ చేశారు. కార్యక్రమంలో గిరిజన నాయకులు గోపీనాథ్, రేడ్యానాయక్, రాములు, రఘునాథ్, లక్ష్మన్ తదితరులు ఉన్నారు.

వేసవి శిబిరంతో విద్యార్థులకు మేలు

నవాబుపేట: వేసవి శిబిరంతో విద్యార్థులకు మేలు జరుగుతుందని కారుకొండ హెచ్‌ఎం దశరథ్‌నాయక్ అన్నారు. గ్రామంలో ఆదివారం క్రీడా క్యాంపు ముగింపు కార్యక్రమంలో పాల్గొని ప్రసంగించారు. క్యాంపు వల్ల విద్యార్థులు వివిధ క్రీడల్లో నైపుణ్యం సాధించగలుగుతారన్నారు. విద్యార్థులకు సర్టిఫికెట్లు అందజేశారు. యూత్ అధ్యక్షుడు రమేష్ విద్యార్థులకు దుస్తులు అందించారు. గ్రామస్తుడు చంద్రకుమార్ రూ.10 వేల నగదును ట్రైనర్ సాయికుమార్‌కు బహుమతిగా ఇచ్చారు. ఎంపీటీసీ గోపాల్, భూపాల్‌రెడ్డి, లోక్‌నాథ్, చెన్నయ్య, సత్తిరెడ్డి, నర్సింహులు పాల్గొన్నారు.

బీజేపీ నాయకుల సంబరాలు



స్వీట్లు పంపిణీ చేస్తున్న నాయకులు

మిడ్జిల్: భారత ప్రధానిగా మూడోసారి నరేంద్ర మోదీ ఆదివారం సాయంత్రం ప్రమాణ స్వీకారం చేయడంతో మండల బీజేపీ నాయకులు సంబురాలు నిర్వహించారు. బస్టాండ్ సమీపంలో టపాసులు పేల్చి.. స్వీట్లు పంపిణీ చేశారు. నాయకులు రాజేశ్వర్, తిరుపతి, నరేందర్, రవి, అరవింద్, శేఖర్, అంజి తదితరులు పాల్గొన్నారు.

రాజాపూర్: మూడోసారి ప్రధానిగా నరేంద్రమోదీ ఆదివారం ప్రమాణ స్వీకారం చేయడంతో రాజాపూర్ మండల కేంద్రంతో పాటు పరిధిలోని రాయపల్లి, ముదిరెడ్డిపల్లి గ్రామాలలో బీజేపీ నాయకులు సంబరాలు నిర్వహించారు. మండల ఉపాధ్యక్షుడు గంగాధర్‌గౌడ్, ప్రశాంత్‌చారి సూరిగౌడ్, తిరుపతి, శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించాలని వినతి



వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

మహబూబ్‌నగర్ ఎడ్యుకేషన్: రాష్ట్ర వ్యాప్తంగా ఉపాధ్యాయులు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించాలని కోరుతూ తపస్ నాయకులు ఎమ్మెల్సీ ఏవీఎన్‌రెడ్డికి ఆదివారం వినతిపత్రం అందజేశారు. ఈమేరకు నాయకులు మాట్లాడుతూ బీఈడీ చేసిన వారికి ప్రాథమిక పాఠశాలల్లో కూడా హెచ్‌ఎం పోస్టులు ఇవ్వాలన్నారు. బడుల్లో అభివృద్ధి పనులు పూర్తిస్థాయిలో పనులు చేపట్టాలని, ఖాళీగా ఉన్న పోస్టుల్లో వాలంటీర్లను నియమించాలని, పెండింగ్‌లో ఉన్న బిల్లులను ఇవ్వాలని కోరారు. సంఘం రాష్ట్ర అధ్యక్షుడు హనుమంతురావు, కార్యదర్శి సురేష్, విష్ణువర్ధన్‌రెడ్డి, జిల్లా అధ్యక్షుడు సునీల్ తదితరులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ అంతరాయం

దేవరకద్ర: మరికల్ 132 కేవీ ఉప కేంద్రంలో అత్యవసర మరమ్మతుల కారణంగా సోమవారం ఉదయం 7 గంటల నుంచి 9 గంటల వరకు విద్యుత్ సరాఫరా నిలిపివేస్తామని ఏఈ సత్యయ్య ఒక ప్రకటనలో పేర్కొన్నారు. మండలంలోని అన్ని సబ్‌స్టేషన్‌ల పరిధిలోని అన్ని గ్రామాలలో విద్యుత్ సరాఫరాలో అంతరాయం ఉంటుందని ప్రజలు గమనించి సహకరించాలని కోరారు.

అధ్యక్షురాలిగా శివ్వ రేఖ

జడ్చర్ల టౌన్: మండల ఆర్యవైశ్య మహిళాసంఘం అధ్యక్షురాలిగా శివ్వరేఖతోపాటు కార్యవర్గం ఆదివారం రాత్రి ప్రమాణస్వీకారం చేశారు. స్థానిక వాసవికన్యకాపరమేశ్వరి ఆలయంలో జరిగిన కార్యక్రమంలో సంఘ జిల్లా అధ్యక్షురాలు మంజుల వారితో ప్రమాణస్వీకారం చేయించారు. ప్రధాన కార్యదర్శిగా గంధం జ్యోతి, కోశాధికారిగా కామిశెట్టి సంధ్య ప్రమాణ స్వీకారం చేశారు. కార్యక్రమంలో ఆర్యవైశ్యసంఘాల నాయకులు కొత్రమధు, దాచేపల్లి చంద్రయ్య, సాయికిశోర్, శివ్వకిశోర్, సత్యనారాయణశెట్టిలతోపాటు పెద్ద సంఖ్యలో ఆర్యవైశ్యులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా నూతన అధ్యక్షురాలు శివ్వరేఖ మాట్లాడుతూ ఆధ్యాత్మిక, సామాజిక రంగాల్లో సేవలు అందిస్తామని ప్రకటించారు.

ప్రభుత్వ పాఠశాలల్లో అన్ని వసతులు



గోపన్నపల్లిలో ప్రచారం చేస్తున్న ఉపాధ్యాయులు

భూత్పూర్: ప్రభుత్వ పాఠశాలల్లో విద్యతో పాటు విద్యార్థులకు అవసరమైన అన్ని వసతులు కల్పిస్తున్నట్లు ఉపాధ్యాయులు పేర్కొన్నారు. ఈమేరకు బడిబాట కార్యక్రమంలో భాగంగా ఆదివారం మండలంలోని వివిధ గ్రామాలల్లో ప్రభుత్వ ఉపాధ్యాయులు ఇంటింటి ప్రచారం నిర్వహించారు. చిన్నారులను ప్రభుత్వ పాఠశాలల్లోనే చేర్పించాలని వారి తల్లిదండ్రులకు అవగాహన కల్పించారు.

లక్ష్మీసూక్త సహిత గాయత్రి హోమం



ఆశ్రమంలో యజ్ఞం నిర్వహిస్తున్న భక్తులు

జడ్చర్ల టౌన్: గంగాపురం సమీపంలో ఉన్న లక్ష్మీనారాయణ స్వామి ఆశ్రమంలో ఆదివారం లోకకల్యాణార్థం విష్ణు పారాయణంతోపాటు లక్ష్మీసూక్త సహిత గాయత్రి హోమం నిర్వహించారు. పూజలు నిర్వహించిన అనంతరం మొదట విష్ణు పారాయణం చేశారు. అనంతరం వేదమంత్రోచ్ఛరణల మధ్య యజ్ఞం నిర్వహించారు. పునర్వసు నక్షత్రం పురస్కరించుకుని హనుమాన్‌చాలీసా పారాయణం జరిపించారు. ఈ సందర్భంగా వక్తలు ఉమ్మెంతల మహేశ్వర్, బి.విజయ్‌కుమార్, ఆశ్రమ నిర్వాహకులు పరమాత్మనంద, పోతులమడుగు ఆశ్రమం నిర్వాహకులు వెంకటచారీ మాట్లాడుతూ ప్రతి ఒక్కరు ఆధ్యాత్మిక బాటలో పయనించాలని.. అప్పుడే సమాజంలో శాంతి నెలకొంటుందన్నారు.

నీట్ ర్యాంకర్‌కు సన్మానం

నారాయణపేట రూరల్: నీట్‌లో ఉత్తమ ర్యాంకు సాధించిన విద్యార్థిని గ్రామస్తులు ఘనంగా సన్మానించారు. మండలంలోని సింగారం చెందిన బోర్ల పుష్ప, విష్ణువర్ధన్ దంపతుల కుమారుడు ఉదయ్‌శంకర్ ఇటీవల జరిగిన నీట్ పరీక్షలకు హాజరై 720మార్కులకు 550సాధించాడు. ఈ మేరకు విద్యార్థిని ఆదివారం సాయంత్రం ఆ గ్రామ పెద్దలు స్థానిక జీపీ భవనం దగ్గర శాలువా, పూలమాలతో సన్మానించారు. కార్యక్రమంలో శ్రీనివాస్, చింతలయ్య, నర్సింహులు, హన్మంతు, మల్లేష్, కనకప్ప, వెంకటప్ప, భాస్కర్, రమేష్ పాల్గొన్నారు.

సేవారత్న అవార్డు

జడ్చర్ల టౌన్: సంస్కారభారతి సభ్యుడు గోనెల రాధాకృష్ణను మహబూబ్‌నగర్ శ్రీకరి ఫౌండేషన్ తరఫు నుంచి శనివారం రాత్రి శ్రీ ఛత్రపతి శివాజీ సేవారత్న అవార్డుతో సత్కరించారు. సంస్కార భారతి సభ్యుడిగా సామాజిక, ఆధ్యాత్మిక రంగాల్లో అందిస్తున్న సేవలకు గానూ ఆయను అవార్డు వరించింది.

సకాలంలో పూర్తయ్యేనా..

- నత్తనడకన అమ్మ ఆదర్శ పాఠశాలల పనులు
- రెండు రోజుల్లో ప్రారంభ కానున్న బడులు



పెద్దర్పల్లిలో సాగుతున్న పనులు



ఏనెమీదితండాలో విద్యుత్ పనులు



పిల్లిగుండు పీఎస్‌లో వాటర్‌ట్యాంకు నిర్మాణ పనులు



ఏనెమీదితండాలో నత్తనడకన ప్లంబర్ పనులు

హన్వాడ: మండల పరిధిలో ప్రభుత్వం పాఠశాలల అభివృద్ధి కోసం చేపట్టిన అమ్మ ఆదర్శ పాఠశాలల పనులు నత్తనడకన సాగుతున్నాయి. మరో రెండురోజుల్లో బడులు ప్రారంభం కానున్న నేపథ్యంలో ఇంకా ఆయా చోట్ల పనులు సాగుతూనే ఉన్నాయి. ఈ నేపథ్యంలో బడుల ప్రారంభం నాటికి పనులు పూర్తయి పూర్తిస్థాయిలో అందుబాటులోకి వస్తాయా అన్న అనుమానం తలెత్తుతోంది. కాగా ఆయా పాఠశాలల్లో చేపట్టిన పనులు నాణ్యతగా జరగడం లేదనే విమర్శలు వినిపిస్తున్నాయి. స్వయానా జిల్లా అడిషనల్ కలెక్టర్ పాఠశాలల్ని పర్యవేక్షించి జూన్ 2 నాటికి పూర్తి చేయాలని ఆదేశాలిచ్చినా ఫలితం లేకపోయింది. ఈ నేపథ్యంలో వేగంగా పూర్తిచేసేందుకు బాధ్యులు చర్యలు తీసుకోవాలని ఆయా గ్రామాల వారు కోరుతున్నారు.

ఉత్సాహంగా బెల్టు గ్రేడింగ్ పరీక్షలు



బెల్టులు సాధించిన విద్యార్థులతో అసోసియేషన్ ప్రతినిధులు

మహబూబ్‌నగర్ క్రీడలు: జిల్లా కేంద్రంలోని బేసిక్ ప్రాక్టిసింగ్ ఉన్నత పాఠశాల ఆవరణలో ఆదివారం వేసవి తైక్వాండో శిక్షణ శిబిరం ముగింపుతోపాటు విద్యార్థులకు బెల్టు గ్రేడింగ్ పరీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా తైక్వాండో అసోసియేషన్ ఉపాధ్యక్షుడు జి.సాయిలు మాట్లాడుతూ మే 1 నుంచి శిబిరం నిర్వహించినట్లు తెలిపారు. బెల్టు గ్రేడింగ్ పరీక్షలో 50 మంది విద్యార్థులు పాల్గొన్నట్లు తెలిపారు. మాధవదీప్, సాత్విక, దీక్ష రెడ్ బెల్టు, విగ్నేష్, శివకుమార్ గ్రీన్ బెల్టు, గార్విక, పోలసి, ప్రియ ఎల్లో–1 బెల్టు, శ్రీవాస్తవ్, బ్రిగేష్, మాధవ్, యహ్యాఅలీ, ఆరాధ్య, ఆమీనా, షాలిని, స్వితికా, మౌనిక, విహాన్ ఎల్లో బెల్టులు పొందినట్లు తెలిపారు. అనంతరం విద్యార్థులకు బెల్టులు, సర్టిఫికెట్లు అందజేశారు. బెల్టులు సాధించిన విద్యార్థులను సాయిలు, జిల్లా తైక్వాండో అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి సురేందర్‌బాబు అభినందించారు. సీనియర్ కోచ్‌లు శంకర్‌నాయక్, రాజేష్, రఫియోద్దీన్, ప్రణవసాయి తదితరులు పాల్గొన్నారు.

మాదిగల కవాతు విజయవంతం చేయాలి

నారాయణపేట: ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక దినోత్సవం సందర్భంగా జులై 7న వేలాది మందితో వరంగల్‌లో భారీ ఎత్తున కవాతు నిర్వహిస్తున్నట్లు ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షుడు కరెప్ప తెలిపారు. ఆదివారం జిల్లా కేంద్రంలోని అంబేడ్కర్ కళాభవనంలో ఎమ్మార్పీఎస్, ఉపకులాల అనుబంధ సంఘాల జిల్లా సమావేశం నిర్వహించారు. ఈ కవాతు మాదిగల ఆత్మగౌరవనికి ప్రతీకగా ప్రతి ఒక్కరు చూడాలని, లక్షలాది మంది మాదిగలు హాజరై విజయవంతం చేయాలన్నారు. అలాగే ఎంపీ డీకే అరుణ గెలుపులో ఎమ్మార్పీఎస్, మాదిగల పాత్ర ఉన్నందుకు గర్వపడుతున్నామన్నారు. సమావేశంలో గడ్డం కృష్ణయ్య, వెంకటయ్యమాదిగ, వెంకటేష్, ఈదెప్ప, వెంకటేష్, రమేష్ తదితరులు పాల్గొన్నారు.



అండర్‌బ్రిడ్జిలో రాకపోకలు ఎలా..?



కొమిరెడ్డిపల్లి అండర్ బ్రిడ్జిలో నిలిచిన వర్షం నీరు



జానంపేట అండర్ బ్రిడ్జి ముందు గుంతలమయంగా రోడ్డు

అడ్డాకుల: మూసాపేట మండలంలోని కొమిరెడ్డిపల్లి, జానంపేట వద్ద 44వ నంబర్ జాతీయ రహదారి అండర్ బ్రిడ్జిల్లో రాకపోకలకు ఇబ్బందులు తప్పడం లేదు. కొమిరెడ్డిపల్లి వద్ద చిన్న వర్షానికే అండర్ బ్రిడ్జిలో వర్షపు నీళ్లు నిలుస్తున్నాయి. దీనివల్ల అండర్ బ్రిడ్జిలో రాకపోకలు నిలిచి పోతున్నాయి. పాదాచారులు రోడ్డుపైకి ఎక్కి కిందికి దిగాల్సి వస్తోంది. ఇక్కడ బ్రిడ్జి నిర్మాణం చేపట్టినప్పుడు బ్రిడ్జిలో నిలిచే నీళ్లు బయటకు వెళ్లే విధంగా ఏర్పాట్లు చేయలేదు. అండర్ బ్రిడ్జి కంటే సర్వీస్ రోడ్లు ఎత్తుగా ఉండటంతో అందులో నిలిచే నీళ్లు బయటకు వెళ్లడం లేదు. దీని వల్ల వర్షం నీళ్లు రోజుల తరబడి బ్రిడ్జిలోనే నిల్వ ఉంటున్నాయి. చిన్న పిల్లలకు ఇక్కడ ప్రమాదం పొంచి ఉంది. కాగా జానంపేట వద్ద అండర్ బ్రిడ్జి లోపల, బయట బురదమయంగా మారింది. బ్రిడ్జి బయట గుంతల్లో నీళ్లు నిలువడం వల్ల స్థానికులకు ఇబ్బందులు కలుగున్నాయి. రహదారి నిర్వాహకులు స్పందించి అండర్ బ్రిడ్జిల సమస్యలను తీర్చాలని ఆయా గ్రామాల ప్రజలు కోరుతున్నారు.